


అడిగోపుల మృతి సాహితీ లోకానికి తీరనిలోటు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ



వేమన విజ్ఞాన కేంద్రంలో ...

ప్రముఖ రచయిత అడిగోపుల వెంకటరత్నం (79) మృతి అభ్యుదయ సాహిత్యానికి తీరని లోటని సాహితీ ప్రవంతి, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నివాళి అర్పించింది. యాభై ఏళ్ళుగా ఆయన సాహితీ లోకానికి అభ్యుదయ రచనలను అందించారన్నారు. అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం ఉదయం తిరుపతిలోని స్వగృహంలో కన్నుమూశారు. వేమన విజ్ఞాన కేంద్రం, సాహితీస్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సమకాలీన సమస్యలకు కష్టజీవుల కలం అడిగోపుల అని కీర్తించారు. నివాళి అర్పించిన వారిలో ఒ.వెంకటరమణ, సాయిలక్ష్మి, టెంకాయల దామోదరం, మల్లారపు నాగార్జున, నడ్డినారాయణ, గురునాధంలు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో ఆదివారం జరగనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

రికార్డుల ఆధారంగా రైతులకు నష్టపరిహారం

ప్రజాశక్తి - వాకాడు

రైతుల వద్ద ఉన్న ఆధారాల మేరకు వారికి నష్టపరిహారం అందించేలా రికమండ్ చేస్తామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. తమ్మినపట్నం, కొత్తపట్నం భూసేకరణ పెండింగ్, పరిహార పంపిణీ అంశాలపై రైతులతో గ్రామసభ శుక్రవారం జరిగింది. మధ్యాహ్నం కోట, చిల్లకూరు మండల పరిధిలోని తమ్మినపట్నం, కొత్తపట్నం గ్రామాల పరిధిలోని ఏపిఐఐసి (క్రిస్ సిటి ప్రాజెక్టుకు సంబంధించిన చెన్నయ్ - బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ నోడ్ (సిబిఐసి) సంబంధించిన భూసేకరణ, పరిహార అంశాలపై ప్రభుత్వ భూమి, డికెటి, ఎలాంటి రికార్డులు లేకుండా ప్రభుత్వ భూమిలో అనుభవంలో ఉన్న రైతులతో గ్రామసభ నిర్వహించారు. పట్టా భూమి, డికెటి భూములకు సంబంధించి వెబ్ లాండ్ నందు ఏపీఐఐసి అని నమోదు అయిన వాటికి రైతుల వద్ద ఉన్న ఆధారాల రికార్డుల మేరకు అర్హత ఉన్నవారికి నష్ట పరిహారంకు రికమెండ్ చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో రైతులు ఎన్నో ఏళ్లుగా అనుభవంలో ఉన్న రైతులకు సంబంధించి వారు ఎన్ని సంవత్సరాలుగా అనుభవంలో ఉన్నారో, ఎంత విస్తీర్ణంలో, ఎంత పెట్టుబడి పెట్టారని 10 టీమ్ లు ఏర్పాటు చేసి సర్వే చేయించాలని సదరు ప్రక్రియ మంగళవారం తమ్మినపట్నం నందు, బుధవారం కొత్త పట్నం, సిద్ధవలం నందు చేపట్టాలని గూడూరు ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. సాగరమాల కింద రోడ్డు వేస్తున్న నడవ వారిపల్లి గ్రామ పరిధిలో సుమారు పది ఎకరాల పైన ప్రభుత్వ భూమిని అనుభవంలో సాగు చేసుకుంటున్న రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, తమ్మినపట్నం మొయిన్ వద్ద ప్రదేశం కండలేరు నీటి ప్రవాహం కోతకు గురౌతుందని, ఎస్టీ కాలనీలోకి తరచుగా వరద ప్రవాహం వస్తోందని దానికి సంబంధించి రిటైనింగ్ వాల్ ఏర్పాటు కొరకు అంచనాలు పూర్తి అయ్యాయని, నిధులు రాలేదని రైతులు, గ్రామస్తులు తెలుపగా కలెక్టర్ దానిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలువురు లేవనెత్తిన ఇంటి స్థలాల పొసెషన్ పై డైరెక్టర్ పోర్ట్స్ వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల పొలాల్లో వేసుకున్న వేరుసెనగ పంటను కలెక్టర్ పరిశీలించారు. కోట మండలం కొత్త పట్నం నందు గ్రామస్తులు తెలిపిన అంశాలపై మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పరిశ్రమల స్థాపన తో పాటు ప్రజల సంక్షేమం కూడా ప్రాధాన్యతా ఉందని తెలిపారు. జిందాల్ పవర్ వారితో మాట్లాడి కార్పొరేట్ సామాజిక బాధ్యతగా వారు నందు గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటి ఏర్పాటుకు చర్చించామని, స్థానికులకు కనీస వేతనాలు కల్పించేలా వారితో మాట్లాడటం జరిగిందని తెలిపారు. గమనించాల్సిన విషయం ఏమంటే 2012 వ సంవత్సరం జీఓ 571 మేరకు పది సంవత్సరాలు, ఆ పైన రైతు సాగులో ఉండి ప్రభుత్వం వారి నుండి భూమిని తీసుకుంటే నష్ట పరిహారం అందించేలా ఉత్తర్వులు ఉన్నాయని, అంతకు మునుపు సంవత్సరాల్లో వాటికి నష్ట పరిహారం చెల్లించడం వర్తించదని, సదరు సిబిఐసి కొరకు 2008 కి ముందు తీసుకున్న రైతులు సాగులో ఉన్న ప్రభుత్వ, డికెటి భూములకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ రైతులకు భూసేకరణ, పరిహార పంపిణీ పెండింగ్ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఏపీఐఐసి చంద్రశేఖర్, తిరుపతి స్పెషల్ ఎకనామిక్ జోన్ జోనల్ మేనేజర్ విజయ రత్నం పాల్గొన్నారు. తూపిలిపాలెం బీచ్లో పర్యాటక అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. టూరిజం ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డితో కలిసి పర్యటించారు.

పెండింగ్ భూసేకరణపై గ్రామసభలో కలెక్టర్



తూపిలిపాలెం వద్ద పర్యాటకాభివృద్ధిపై కలెక్టర్ పరిశీలన

ఎస్వీయూ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంచార్జ్ ఉపకులపతిగా ఆచార్య సి.హెచ్. అప్పారావును నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది. ఆచార్య అప్పారావు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపకులపతి గా పదవీబాధ్యతలు స్వీకరించారు. వీరు ఎస్వీయూలో 1989 నవంబర్లో బయోకెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరారు. 2006 లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. యస్వీయూలో డి.ఓ. ఏ. డైరెక్టర్ గా, శాఖాధిపతిగా , బి. ఓ. యస్. ఛైర్మన్ గా పనిచేశారు. సి.డి.సి. డీన్ గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. ఎస్వీయూలో సీనియర్ ఆచార్యులైన వీరిని ప్రభుత్వం ఇంచార్జ్ ఉపకులపతిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రిజిస్ట్రార్ డా.చంద్రయ్య, ఆచార్య భూపతినాయుడు, ఆచార్య అమర్నాథ్, ఆచార్య త్యాగరాజు, విద్యార్థి సంఘ నాయకులు ఆనందగౌడ్, హరికష్ణ యాదవ్ తదితరులు అభినందించారు.



ఆచార్య ఉమ బాధ్యతలు స్వీకారం

శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ కి చెందిన ఆచార్యులు ప్రొఫెసర్ వి.ఉమ శుక్రవారం ఉదయం వైస్ ఛాన్సలర్ చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.ఉమ 1983లో విశ్వవిద్యాలయం స్థాపించినపుడు లెక్చరర్‌గా జాయిన్ అయ్యారు. ఈమె టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుండి ఎమ్ ఎస్ డబ్ల్యూ పూర్తి చేసి, విదేశాలలో పీహెచ్డీ పూర్తి చేశారు. ముప్పైఐదు సంవత్సరాల పైచిలుకు, బోధన, పరిశోధన అనుభవం కలిగి ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అమ్మాయిల భవిష్యత్తు కోసం స్థాపించిన యూనివర్సిటీ పురోగతికి కషి చేస్తానని, రూసా ద్వారా వచ్చిన నిధుల ద్వారా యూనివర్సిటీని అభివద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజనీ, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.గీతావాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా ఆచార్య భూపతి నాయుడు



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా దూరవిద్య విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న ఆచార్య యం. భూపతి నాయుడును నియమిస్తూ ఇన్చార్జ్ విసి ఆచార్య అప్పారావు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం 4.45 గంటలకు ఆచార్య భూపతి నాయుడు రిజిస్ట్రార్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగా ఆచార్య భూపతి నాయుడు 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఎస్వీయూలో చేరారు. 27 సంవత్సరాల బోధనానుభవం గల భూపతి నాయుడు వివిధ కమిటీల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన వారిని ఎస్వీయూలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ , డీన్లు, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

'అధికార' అరాచకం

చిరుద్యోగులపై వేధింపులు
రాజీనామా చేయాలంటూ ఒత్తిళ్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి

'దాడులకు ప్రతిదాడులు సరికాదు.. సామరస్యపూర్వకంగా వ్యవహరించండి.. తప్పు చేసేవారిపై చర్యలకు చట్టాలున్నాయి.. ప్రతీకార చర్యలకు పూనుకోవద్దు' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే సూచిస్తున్నప్పటికీ అధికార పార్టీ దాడులు పెట్రేగిపోతూనే ఉన్నాయి. రాష్ట్రంలో అధికార బదిలీ జరిగినప్పటి నుంచి చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయి. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల చేత రాజీనామాలు చేయించి, వారి స్థానంలో తమ పార్టీకి చెందిన వారిని నియమించుకోవాలనే ఉద్దేశంతో వేధింపులకు పాల్పడుతున్నారు.


ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు మచ్చుకు కొన్ని......శ్రీకాళహస్తి పట్టణం ఎంపేడులో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న సౌజన్యను తొలగించేందుకు టిడిపి నాయకులు పి. ఈశ్వర్‌రెడ్డి వేధింపులకు పాల్పడుతున్నారు. పుత్తూరు పట్టణం భవానీ నగర్ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న పి.లీలావతిని ఉద్యోగం నుంచి తొలగించాలని కౌన్సిలర్ ఒత్తిడి చేస్తున్నారు. పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు సాయిలక్ష్మి, సత్యవేణిలను ఇదే విధంగా టిడిపి నాయకులు వేధిస్తున్నారు. నారాయణవనం మండలంలో ఇద్దరు ఫీల్డ్‌అసిస్టెంట్లు తంగరాజు, కుమ్మర కుప్పయ్యలను నిర్ధాక్షణ్యంగా తొలగించారు. సత్యవేడులో మధ్యాహ్న భోజన వర్కర్లు లీలావతి, వసంతమ్మను విధులకు రావద్దని చెబుతున్నారు. ఈ విధంగా తిరుపతి జిల్లాలో 32 మండలాల పరిధిలో దాదాపు వెయ్యి మందికి పైగా చిరుద్యోగులతో రాజీనామాలు చేయించాలని నెల రోజులుగా అధికారపార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఒక్క శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే 37 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. తమ మాట వినకపోతే ఊరి నుంచి వెలివేస్తామని హెచ్చరిస్తుండటం గమనార్హం. దీంతో దిక్కుతోచని స్థితిలో చిరుద్యోగులు సిఐటియును ఆశ్రయించారు.

'ఆశా' ఉద్యోగమే ఆధారం : కృష్ణవేణి, బాలాయపల్లి



మాది వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం. సుబ్రమణ్యం గ్రామంలో ఆశా వర్కర్‌గా 18 ఏళ్లుగా సేవలందిస్తున్నాను. నాకు ముగ్గురు కుమార్తెలు. భర్త వ్యవసాయ కార్మికుడు. చర్మ సంబంధిత క్యాన్సర్‌తో బాధపడుతున్న ఇద్దరు కుమార్తెలల్లో ఒకరు మృతి చెందారు. చిన్న కుమార్తె ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. నేను పనిచేస్తేనే నా కుటుంబం ఆకలి తీరుతుంది. అయితే ఇరవై రోజులుగా మా గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు నన్ను ఉద్యోగం నుంచి తీసేయాలని పట్టుబడుతున్నారు. మెడికల్ ఆఫీసర్, మండల అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. విధులకు సక్రమంగా రావడం లేదని నింద వేస్తున్నారు. ఊళ్లో ఒక్కరంటే ఒక్కరు నాపై వ్యతిరేకంగా చెప్పలేదు. నన్ను తీసేసి వాళ్లొళ్లని పెట్టుకోవాలని చూస్తున్నారు.

వేధింపులు మానుకోండి : కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు



రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశా, సంఘమిత్ర, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీమ్ వర్కర్లపై టిడిపి నాయకులు రాజకీయ వేధింపులను మానుకోవాలి. రాష్ట్రంలో రాజకీయ వేధింపులు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదే పదే ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి వాటికి స్వస్తి చెప్పకపోతే కార్మికులందర్నీ ఐక్యం చేసి పోరుబాట పడతాం.



చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలి : డిఎఫ్ఒ

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

మండలంలోని కొట్టాల హౌసింగ్ కాలనీ సమీపంలో అటవీ ప్రాంతం నందు చిరుత పులి సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి డిఎఫ్ఓ సతీష్ రెడ్డి కోరారు. శుక్రవారం కొట్టాల పరిసర ప్రాంతాలను ఆయన సందర్శించారు. సోషల్ మీడియాలో చిరుత సంచారం పై వైరలైన వీడియోకు స్పందించి వెంటనే అటవీశాఖ అధికారులను కొట్టాల గ్రామానికి పంపి ప్రజలను అప్రమత్తం చేశానని డీఎఫ్ఓ సతీష్ రెడ్డి తెలిపారు. గొర్రెలు, మేకలు, పశువుల కాపర్లు పశువులు తీసుకుని మేత కోసం అడవుల్లోకి వెళ్లరాదని ఆయన సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ఎవరు బయటకు రాకూడదని గ్రామస్తులకు హెచ్చరికలు జారీ చేశారు. కొట్టాల అటవీ ప్రాంతంలో అటవీ శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా ప్రత్యేకమైన పదిమందితో కూడిన టీం ను ఏర్పాటు చేసి రాత్రింబగళ్లు గస్తీలు తిరిగేటట్లు ఏర్పాటు చేశామన్నారు. చిరుతపులి సంచారాన్ని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలతో వీడియోలు చిత్రీకరిస్తున్నామని, అలాగే అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఎవరూ భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని, అటవీ శాఖ సిబ్బంది మీకు అందుబాటులో ఉంటారని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వీలైనంత త్వరగా చిరుత సంచారాన్ని గుర్తించి బోన్లు ఏర్పాటు చేసి చిరుతను బంధిస్తామన్నారు. ఎఫ్.ఆర్.ఓ.మాధవి, డి.ఆర్.ఓ. వేణు ఎఫ్.ఎస్.ఓ.చైతన్య, ఎఫ్.బి.ఓ. అనిత, రజిని, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో అలా..అధికారంలో ఇలా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్కీం వర్కర్లకు అండగా ఉన్నారు..! అధికారంలోకి రాగానే రాజకీయ వేధింపులు మొదలు పెట్టారు..! ఇదెక్కడి న్యాయం' అంటూ కూటమి ప్రభుత్వ తీరును సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఎండగట్టారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శుక్రవారం కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ హక్కుల సాధన కోసం గత వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్కీం వర్కర్లుగా పని చేస్తున్న అంగనవాడీలు, ఆశాలు, సంఘమిత్రలు, క్షేత్ర సహాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ ఆయాలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పుడు అప్పటి ప్రతిపక్ష పార్టీలు అండగా నిలిచాయని తెలిపారు. ఆ క్రమంలో తాము అధికారంలోకి వస్తే రాజకీయ వేధింపులు ఉండవనీ, మీ హక్కులన్నింటినీ తీరుస్తామంటూ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక స్కీం వర్కర్లపై యధావిధిగా రాజకీయ వేధింపులు షురూ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని కొన్నిచోట్ల కూటమి నేతలు నేరుగా స్కీం వర్కర్ల ఇళ్లకు వెళ్లి మర్యాదపూర్వకంగా రాజీనామాలు చేయాలనీ, లేకుంటే తగిన పర్యావసనాలు చవిచూడాల్సి వస్తుందంటూ బెదిరించి వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, ఏఐటియుసి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి వైఎస్ మణి, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో స్కీం వర్కర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న అంగేరి పుల్లయ్య

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటా :చెవిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గత ఐదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంత్రి పెద్దిరెడ్డి సహకారం తీసుకొని తన ఆర్థిక కార్యకలాపాలను చక్కదిద్దుకున్నారని, నేడు అధికారంలోకి వచ్చాక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలను వెంటాడి వెంటాడి ముసుగులు ధరించి భౌతిక దాడులు చేస్తున్నారని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం తిరుచానూరు పరిధిలోని ఓ ప్రైవేటు హోటల్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాజకీయాలలో హుందాగా ఉండాలని తాను అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ పులివర్తి నానికి సంబంధించిన క్వారీలపై గాని, అతని ఆర్థిక లావాదేవీలపై గాని జోక్యం చేసుకోలేదన్నారు. నాని సతీమణి సుధా రెడ్డి ద్వారా పెద్దిరెడ్డి వద్ద నుంచి అనేక దఫాలు సాయం పొందారని స్పష్టం చేశారు. పల్లెల్లో ప్రశాంతంగా ఉండాల్సిన వాతావరణాన్ని నేడు భయానకంగా మారుస్తూ రెచ్చగొట్టే కార్యక్రమాలను చేసి వైసిపికి చెందిన వారిని టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఎన్నికల ప్రచారాలలో పులివర్తి నాని ఎమోషనల్ బ్లాక్మెయిలింగ్ చేశారని ఆరోపించారు. అధికారం చేపట్టిన మాసం కాలంలోపే 34 మంది వైసీపీకి చెందిన వారిని భౌతికంగా గాయపరచారన్నారు. అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తే కోర్టు కేసులను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో వెంకటపతి నగర్ సర్పంచి చిన్ని యాదవ్, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, కేశవులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


చెవిరెడ్డికి నిందా రాజకీయాలు తగదు : నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనపై నింద రాజకీయాలు చేయడం మొదలు పెట్టాడని, అతను చేసిన దొంగ ఓట్లు, అక్రమాలపై విచారణకు లేఖలు పంపడంతో జీర్ణించుకోలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆగ్రహంతో మాట్లాడారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో చంద్రగిరి నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విచారణలను గురించి ఎమ్మెల్యే నాని మాట్లాడారు. తనకు చెందిన క్వారీలపై ఉద్దేశం పూర్వకంగా జరిమానాలు వేయిస్తే తాను కోర్టుకు వెళ్లి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకొని, వాటిని నడపడానికి డబ్బులు లేక తన భార్య బంగారాన్ని కుదువ పెట్టి సజావుగా నడిపించానన్నారు. తుడా నిధులు 243 కోట్లు రూపాయలను నిబంధనలకు విరుద్ధంగా 6 మండలాలకు బదలయించి వినియోగించారని, ఇంకా తుడా ద్వారా ఎన్నో అక్రమాలు చేశారని అన్నారు. వీటన్నింటిపై ఒక్కొక్కటిగా విచారణ చేయాలని నేను చేస్తున్న ప్రయత్నాలకు మాజీ ఎమ్మెల్యే కోపోద్రిక్తుడై నోటికొచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లకు సంబంధించి, నిధుల గోల్మాల్, భూముల విషయాలలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తప్పకుండా జైలుకు పోతారని అన్నారు. వారం రోజుల్లో చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన అక్రమాలకు సంబంధించి పూర్తి వివరాలతో మీడియా ముందుకు వస్తానని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, అలిమినేని మధు, సుబ్రహ్మణ్యం నాయుడు, సురేష్ రెడ్డి, సి. మధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'సైకో' ప్రేమలు



తిరుపతి జిల్లాలో తాజా ఘటనలు
గంజాయి మత్తులో యువత
అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

ప్రజాశక్తి – తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లాలో గంజాయి మత్తులో యువత జోగుతోంది. ఆ మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండా 'సైకో'ల్లా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో తాజాగా జరిగిన గూడూరు, దొరవారిసత్రం, తిరుపతి రాయల్‌నగర్ ఘటనలను పరిశీలిస్తే గంజాయి మత్తులో మానవమృగాల్లా వ్యవహరించారని విచారణలో తేలింది. రెండు రోజుల క్రితం సూళ్లూరుపేట నియోజకవర్గంలో దొరవారిసత్రం పంచాయతి నెలబల్లి గ్రామంలో ఓ సైకో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. అలాగే గూడూరు పట్టణంలో రౌడీషీటర్ వినయ్ ఓ విద్యార్థిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కాలేజీకి బయల్దేరిన ఆ విద్యార్థిని బలవంతంగా ఆటోలో తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో అత్యాచారం చేశాడు. ఆ అవమానం భరించలేని ఆ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం నెల్లూరు ఆస్పత్రిలోచికిత్స పొందుతోంది. నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తాజాగా గురువారం రాత్రి తిరుపతి నగరంలోని రాయల్‌నగర్‌లో శ్రీను అలియాస్ శ్రీనివాస్ పక్కింట్లో ఓ అమ్మాయిని మూడేళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అతని వికృతచేష్టలు భరించలేక అమ్మాయి తండ్రి బిబిఎ చదువుకోసం న్యూఢిల్లీలో చేర్పించారు. సెలవుల నిమిత్తం రెండు రోజుల క్రితం ఆ అమ్మాయి ఇంటికి రావడంతో తాను ప్రేమించిన అమ్మాయిని తనకు దూరం చేస్తారా? అంటూ పథకం ప్రకారం ముసుగు వేసుకుని వచ్చి అమ్మాయి నాయనమ్మ జయలక్ష్మి (70)ని కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అంతటితో ఆగని ఉన్మాది శ్రీను ఇద్దరు అమ్మాయిలపైనా కత్తితో దాడికి యత్నించాడు. ఇందులో ఓ అమ్మాయికి గొంతుపై గాయం కావడంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌పి సుబ్బరాయుడు సిసి ఫుటేజీలను పరిశీలించారు. పరిస్థితులను చుట్టుపక్కలవారిని అడిగి తెలుసుకున్నారు. ఈ అఘాయిత్యానికి పాల్పడింది శ్రీనివాసులేనని నిర్ధారణకు వచ్చారు. శ్రీనివాసులు గత ఐదేళ్లుగా జులాయిగా తిరుగుతున్నాడు. తండ్రి చనిపోవడంతో దుబాయ్‌లో ఉన్న అన్న పంపే డబ్బుతో విలాసాలకు పాల్పడేవాడు. మద్యానికి, గంజాయికి బానిసయ్యాడు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఐదు బృందాలు అతనిని పట్టుకోడానికి వెళ్లాయి. నిందితుడు శ్రీనివాసులును హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విద్యార్థినిపై అత్యాచార కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

విద్యార్థినిపై అత్యాచారం కేసులో నిందితున్ని అరెస్టు చేశారు. శుక్రవారం గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో డి.ఎస్పీ సూర్య నారాయణ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గూడూరు రెండో పట్టణానికి చెందిన బాధితురాలు ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోందన్నారు. ఒకటో పట్టణనికి చెందిన రౌడీ షీటర్ మహేష్ బుదవారం బాధితురాలిని కత్తి తో బెదిరించి ఆటోలో తీసుకెళ్లి గాంధీనగర్ ప్రాంతంలోని నిర్జీవ ప్రాంతంలో అత్యాచారం చేశాడు. బాధితురాలు, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. శుక్రవారం గూడూరు పట్టణ పరిధిలోని తాళమ్మ గుడి సమీపంలో నిందితున్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. అనంతరం కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసును త్వరిత గతిన ఛేదించిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సీఐ పాపారావు, ఎస్.ఐ శ్రీహరి బాబు పాల్గొన్నారు.



వాటర్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో ప్రమోషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి :

టిటిడి వాటర్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో ప్రమోషన్లు ఇవ్వాలని యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. యూనియన్ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. గౌరవాధ్యక్షులు గోల్కొండ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, యూనిఫాం కుట్టిన బిల్లు ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, స్ట్రీట్‌లైట్ హైట్‌పెరిగిన కారణొగా కొత్త లిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. పద్మనాభం, నాగరత్నం, దార రవికుమార్; జగదీష్, ప్రతిభా భారతి పాల్గొన్నారు.

కళాశాలల సీట్లు పెంచాలని ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతి నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, అనుగుణంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. టిటిడి కళాశాలల్లో సీటు పెంచాలని, ప్రతి ఒక్కరికీ హాస్టల్ సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ మెస్సు బిల్లులు తక్షణం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఉపాధ్యక్షులు వినోద్, నాయకులు నరేంద్ర, శ్రీనివాస్, గణేష్, చైతు, రవీంద్ర పాల్గొన్నారు.

అప్రమత్తంగా వుండాలి


గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ అధికారి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కెవిబిపురం మండల ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా వుండి రక్షించుకోవాలని ఎంపిడిఓ రెడ్డెప్ప అన్నారు. డ్రై డే భాగంగా శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో సెక్రెటరీ ఇంజ నీరింగ్, హెల్త్ అధికారులు, సిబ్బంది తో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, డ్రై డే, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం: ఏఈ

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండల పంచాయతీ పరిధిలో శనివారం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వినియోగదారులు సహకరించాలని స్థానిక విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జి ఏఈ పుల్లకోటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐయదలో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో పరిసర గ్రామాల్లోను విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుంతల రహదారికి మోక్షం

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో గుంతల రహదారికి మోక్షం లభించింది. నాగయ్య మలుపు నుండి శ్రీవారి మెట్టు వరకు వున్న గుంతల రోడ్డు స్థానంలో నూతన రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న చంద్రగిరి శ్రీవారి మెట్టు వరకు రహదారికి నిర్మాణ పనులు చేపట్టారు. చంద్రగిరి బస్టాండ్ కు టౌన్ బస్సు రావడానికి వీలుగాని విధంగా ఆ ప్రాంతం ఉండటంతో ఈ ప్రాంతాన్ని జెసిబితో సదరం చేసి బస్సు ప్రవేశ ఇబ్బందులను గుర్తించి ఆ ప్రాంతంలోని ఎత్తు పల్లాలు సరిచేసి ముళ్ళ పొదలు తొలగించారు. టౌన్ బస్సుల పునరుద్ధరణతో విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు పులివర్తి నానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే మెడికల్ డాక్టర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు రైల్వే హాస్పిటల్‌లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ తిరుపతి రైల్వే హాస్పిటల్‌కు బదిలీపై వెళ్లిన సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్‌కుమార్‌ను రైల్వే సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. గూడూరు రైల్వే హాస్పిటల్ నూతన వైద్యాధికారిగా డాక్టర్ మేఘనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ రైల్వే సూపరింటెండెంట్ పల్లం వెంకటేశ్వర్‌రావు, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఆరేటి వెంకటేశ్వర్‌రావు, మాజీ డిఆర్‌యు సిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కెబీఎన్ రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవికుమార్, నాగరాజు, మెడికల్, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: స్థానిక విట్టిచెర్ల పంచాయతీ సచివాలయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందించిందని మండల టిడిపి కన్వీనర్ బెల్లంకొండ మురళి తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనల మేరకు, తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో అంకాలజీ డిపార్ట్మెంట్ వారు క్యాన్సర్‌పై ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారన్నారు. మొత్తం యాబై రెండు మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా అందులో నలుగురికి వ్యాధి లక్షణాలున్నట్లు గుర్తించి స్విమ్స్‌కు రెఫెర్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరెడ్డి, నాయకులు ఆర్‌వి రమణారెడ్డి, కుమారస్వామి రెడ్డి, అరికెల రామకృష్ణ రెడ్డి, సహదేవ రెడ్డి, మునస్వామి నాయుడు పాల్గొన్నారు.

టీచ్ టూల్ శిక్షణను పరిశీలించిన డీఈఓ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న టీచ్ టూల్ ట్రైనింగ్‌ను రెండవ రోజు శుక్రవారం డీఈవో శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల తనిఖీ అనుభవాలను తెలిపారు. టీచ్ టూల్ గురించి క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. విద్యార్థులను ఉన్నత స్థితికి చేర్చాలన్నారు. శిక్షకులు నాగరికతను జోడించి ఉన్నత స్థాయికి తీసుకురావాలని, మంచి విద్యార్థులుగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి, మండల విద్యా శాఖాధికారులు, రిసోర్స్ పర్సన్స్, పుత్తూరు, నారాయణ వనం, వడమాల పేట, పిచ్చాటూరు, సత్యవేడు, నాగలాపురం మండలాల పరిశీలకులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినా యుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డీసీ వెంకటేశులు ఆధ్వర్యంలో లక్ష్మీపురం యానాది కాలనీలో కుష్టు వ్యాధి నిర్ధారణ, నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని ప్రతి ఇంటిలో సభ్యులకు కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కుష్టి వ్యాధి నిర్ధారణ అయితే ఉచిత చికిత్స చేసి అంగవైకల్యం రాకుండా, ఇతరులకు వ్యాపించకుండా చేస్తామని తెలిపారు. లక్ష్మీపురం యానాది కాలనీలో పాఠశాల పిల్లలకు, ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏకలవ్య గురుకుల పాఠశాల పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జేవీల రోడ్డు ప్రమాదానికి గురైన పుత్తూరు రూరల్ మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పాలా నాగభూషణంను శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గురైన నాయకుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు బాబు రాయల్, పరంధాం, కుమార్ రెడ్డి, సారథి పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా వుండాలి: పశువైద్యాధికారి

ప్రజాశక్తి - బాలాయపల్లి: పశువులకు అంటు వ్యాధులు ఎక్కువ వచ్చే ప్రమాదం వుందని పాడి రైతులు అప్రమత్తంగా వుండాలని పశువైద్యాధికారి సుధీర్ పేర్కొన్నారు. మండలంలోని నన్నూరు మిట్ట లో పాడి గేదెలకు ముసుర వ్యాధి రావడంతో చికిత్స చేశారు. పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఇచ్చారు. గొర్రెలన్నింటి నీళ్లు గేదెలకు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివా లయ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీకి నివారణే ఉత్తమ రక్షణ

ప్రజాశక్తి - సత్యవేడు: డెంగీకి నివారణే ఉత్తమ మార్గమని వైద్యాధికారులు సూచించారు. సత్యవేడు మండలంలోని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం శుక్రవారం స్థానిక దాసుకుప్పం లో డెంగీ వ్యతిరేక మాస ఉత్సవాలలో భాగంగా డ్రైడే, డ్రైడేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుణశేఖర్, తహశీల్దార్ రామాంజనేయులు, స్థానిక వైద్యులు గుణశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్ శివ సుబ్రహ్మణ్యం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ పునఃప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రైల్వేస్టేషన్ ఆవరణలో ఆటో స్టాండ్‌ను ఆరణి మదన్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి బిజి కృష్ణ యాదవ్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేస్టేషన్ ఆవరణలో గతంలో ఉన్న ఆటో స్టాండ్ ను పునః ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆటో యూనియన్ల జనసేన నాయకులు రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఆనంద్, లండావేలు రాజేశ్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో 'గ్రీన్‌ర్యాలీ'

ప్రజాశక్తి - తిరుమల: టి.ఎస్.ఎన్. పురం శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులచే వాటర్ డే, ఇండియా గ్రీన్ ఇండియా మిషన్ స్లోగన్ ప్లేకార్డ్స్ ను ప్రదర్శిస్తూ పాఠశాల ప్రాంగణం నుండి కపిల తీర్థం నంది సర్కిల్ వరకు విద్యార్థుల చే ర్యాలీ చేపట్టారు. తిరుపతి జోన్ ఏ.జి.ఎం. సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ కే.మోహన్ బాబు నవ్యత, పరిశుభ్రతకు సంబంధించిన పట్టణ నమూనాను మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌కు సమర్పించారు.

ట్రై సైకిళ్ల వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని పూల తోట ప్రాంతంలో ఇద్దరు ప్రత్యేక ప్రతిభా వంతులకు ట్రై సైకిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. వాళీ అంకిత్యార్ రావు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యుల సాయంతో ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వాసిలి ప్రవీణ్, 16వ వార్డు మాజీ కౌన్సిలర్ వాసిలి పావని, వాసిలి గిరిజమ్మ, ప్రసూనమ్మ, సుకన్య, రెడ్ సంఘ సభ్యులు జానా సుధీర్, మేదారు శ్రీనివాస ఆచారి, అస్లాం పాల్గొన్నారు.

బిందె నీటి కోసం కోటి కష్టాలు!

- మరమ్మతుకు నోచని మోటార్ - ఐదు రోజులుగా అందని నీరు
- కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన దుస్థితి

ప్రజాశక్తి - బాలాయపల్లి : తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం అంబలపూడి అరుంధతి వాడలో ఐదు రోజులుగా తాగు నీటికి పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఈ గ్రామంలో సుమారు 200 మంది జీవనం సాగిస్తున్నారు. బిందె నీళ్లు కావాలంటే కిలో మీటరు దూరం నడిచి తెచ్చుకుని పూట గడుపుకుంటున్నారు. తాగునీటిని అందించే మోటార్ నాలుగు రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామస్తులు నీటి కోసం సతమతమై పుతున్నారు. తప్పని పరిస్థితుల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న గ్రామ బస్సు షెల్టర్ వద్దకు వెళ్లాల్సి వస్తోంది. లేదంటే ఊరిలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని మంచినీటి కుళాయి వద్దకు పరుగులు తీయక తప్పడం లేదు. ఆటోలలో ద్విచక్ర వాహనాల్లో నీళ్లు తెచ్చుకొని పూట గడుపుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



కిలోమీటరు నడిచి బిందు నీరు

తాగునీటి కోసం ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలి. లేకపోతే చుట్టి గ్రామానికి వెళ్లే బస్సు షెల్టర్ వద్ద ఉన్న బోర్ల నుంచి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

- రమణమ్మ, అంబలపూడి.

ఆటోలో తెచ్చుకుంటున్నాం..

మూడు రోజులు నుంచి నీళ్లు రాక పోవడం వల్ల కిలోమీటరు దూరం వెళ్లి నెత్తిన మోయలేక, ఆటోలు బాడుగకు తీసుకొని తాగునీరు తెచ్చుకొని జీవనం సాగిస్తున్నాం..

- విజయమ్మ, అంబలపూడి.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ కోరారు. గూడూరు పట్టణంలోని ఆశోక్‌నగర్‌లో ఏడవ వార్డు సచివాలయం, 32 వార్డు సచివాలయం, నెల్లటూరు, చెన్నూరు గ్రామ సచివాలయాల్లోని సిబ్బందికి రైతు సంఘం నాయకులు సిపిఎం నాయకులతో కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 వేలు రైతులకు పెట్టుబడిసాయం అందించాలని, విద్యుత్ మీటర్లకు సంబంధించిన జీ.ఓ. నెం.22 రద్దు చేయాలని, ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులకు భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డు లివ్వాలన్నారు. ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. రోజు కూలీ రూ. 600కు పెంచాలని, పెండింగ్ ఉపాధి బిల్లులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, ఆటో యూనియన్ నాయకులు బివిరమణయ్య, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు పుట్ట శంకరయ్య, బి చంద్రయ్య, అడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని పలు పంచాయతీలలోని రైతులు ఏర్పేడు, ఆమందూరు, మేర్లపాక సచివాలయాలలో జిల్లా రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో రైతులు సచివాలయం అధికారులకు వినతి పత్రాలు అందించారు.

సచివాలయ సిబ్బందికి వినతి


సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం కార్యదర్శి హేమలత మాట్లాడుతూ 2023 వ సంవత్సరం ఖరీఫ్, కరువు తుఫానుతో నష్టపోయిన రైతులకు పంట బీమా పరిహారం ఈ సంవత్సరం ఇప్పటి వరకు జమ చేయలేదని, తక్షణమే రైతులు, కౌలు రైతులకు భూతాల్లో జమ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు ఇస్తామన్న పంట పెట్టుబడి 20వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని కోరారు. జీవో నెంబర్ 22 వెంటనే రద్దు చేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కే రంగయ్య రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వాకాడు: పలు మండలాల్లో శుక్రవారం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో గూడూరు ఎమ్మెల్యే పి సునీల్‌కుమార్ పాల్గొన్నారు. చిట్టమూరు మండల కన్వీనర్ గణపతి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో ఈశ్వరవాక పంచాయతీలోని గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రంను ఎమ్మెల్యే ప్రారంభించారు. వాటితో పాటు ఆలేటిపాడు నుంచి బయ్య వారి కండ్రిగ మీదుగా నాయుడుపేట మల్లం రోడ్డును కలుపుతూ రూ.ఐదు కోట్ల 35 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండ లంలోని అభివృద్ధి కార్యక్రమాలు తాను ఎమ్మెల్యేగా వున్న ఐదు సంవత్సరాలలో చేసినవేనని తర్వాత కాలంలో వచ్చిన వైసిపి నాయకులు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని పేర్కొన్నారు. ప్రజలు తనపై వుంచిన నమ్మకం మేరకు


గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వెంటనే అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గుండుబోయిన కస్తూరయ్య, జనార్దన్ రెడ్డి, నల్లారెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండల అధికారులను ఆదేశించారు. కేవీబీ పురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిపి మునిలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకి సేవ చేసే అవకాశాన్ని అధికారులు సద్వినియోగం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి, మండల ప్రగతికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, అవి నీతికి పాల్పడకుండా నిజాయితీగా పని చేయాలని ఎమ్మెల్యే అధికారులకు హితవు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను అధికారులు, ప్రజాప్రతినిధులు గజమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని టిడిపి నేత బాబు దుకాణం వద్ద తక్కువ ధరలకు నిత్యా వసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి, జనసేన నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ఉపాధి అవకాశాల కల్పనలో ఎంబియు అగ్రగామి: విసి

ప్రజాశక్తి రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని ఏ రంగంపేటలో ఉన్న ఎం బి యూనివర్సిటీలో ఇంజనీరింగ్, వివిధ కోర్సులలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు మెరుగైన వేతనాలతో కూడిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఎంబియు అగ్రస్థానంలో ఉందని ఎంబియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజ రామారావు పేర్కొన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీ లో 2024-25 సంవత్సరం ఇంజనీరింగ్ బ్రాంచీల్లో అడ్మిషన్లు పొందిన నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమం వారిని ఆహ్వానించడంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన నాణ్యమైన విద్య నేర్పించడమే తమ లక్ష్యం అన్నారు. డీన్, ఫ్రెష్‌మెన్ డాక్టర్లు ఆనో గిరీష్ మాట్లాడుతూ భవిష్యత్తు సవాళ్లను, అవకాశాలను ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలను ఈ విశ్వవిద్యాలయం అందిస్తుంది దన్నారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ బి ఎం సతీష్ మాట్లాడుతూ మోహన్‌బాబు యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలను, సాధించిన వివిధ జాతీయ ర్యాంకింగ్స్, అక్రిడేషన్లను నూతన విద్యార్థులకు, తల్లి దండ్రు లకు వివరించారు. ముఖ్య అతిథి, రిజిస్ట్రార్ డాక్టర్ కె సారథి యూనివర్సిటీ లోని బోధన పద్ధతులు, తరగతి గదిలో విద్యార్థుల వ్యవహార శైలి పట్ల పలు కీలక సూచ నలు చేశారు. కాలేజీ స్టాండర్డ్‌లో ఎంబియూ టాప్ వంద ర్యాంకుల లోపు ఉన్న అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలతో జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్స్, పరిశ్రమ దిగ్గజాలతో సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్ర మంలో వివిధ డీన్లు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంబియూ విసి నాగరాజ రామారావు

తక్కువ ధరలకు సరుకులు: తహశీల్దారు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఫుడ్ బాస్కెట్ సూపర్ మార్కెట్, కిరణ్ సూపర్ మార్కెట్‌లో సరుకులు తక్కువ ధరలకు లభిస్తాయని తహశీల్దార్ కె శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని కాపు, బజారు వీధిలోని ఫుడ్ బాస్కెట్ సూపర్ మార్కెట్, కిరణ్ సూపర్ మార్కెట్‌లను తహశీల్దారు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమానులకు ప్రభుత్వ నిబంధనల మేరకు స్టీమ్డ్ బియ్యం 49 రూపాయలకు, సాధారణ రైస్ 48 రూపాయలకు, కంది పప్పు 160 రూపాయలకే అమ్మాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ డిటి బిష్ణు, ఇన్‌ఛార్జి ఆర్ఐ జి గురుస్వామి, వీఆర్వోలు ఆశ, యశోద, పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ఎసిపిచెన్నరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీజల యుగంధర్, నాయకులు ఈశ్వర్, హరి, రిటైల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.


సూపర్ మార్కెట్లను ప్రారంభిస్తున్న తహశీల్దారు శ్రీనివాస్‌గౌడ్

గంజాయి అణచివేతకు స్పెషల్ డ్రైవ్: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో రోజురోజుకూ గంజాయి వినియోగం పెరిగిపోతున్న కారణంగా ఎన్నో దురాగతాలకు కారణమవుతుందని, ప్రశాంతమైన తిరుపతి వాతావరణాన్ని దెబ్బతీస్తుందని నెలకొల్పడానికి గంజాయి అణిచివేతకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చామని టిడిపి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సుగుణమ్మ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురువారం రాత్రి తిరుపతి రాయల్ నగర్ లో జరిగిన హింసాత్మక ఘటనను మత్తులో ఉన్నవారే చేయగలరన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా చేయడానికి రాష్ట్ర హోం మంత్రి అనిత ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడి అండతో నగరంలో ఏ చిన్న బడ్డీ కొట్టులో అయినా గంజాయి దొరికేదని ఆరోపించారు. దీని ద్వారా ఎంతో సొమ్మును వెనకేసుకున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బ్యాంకు శాంతమ్మ, విజయ్ కుమార్, పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో బస్ స్టేషన్: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్థానిక బస్ స్టేషన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. సెంట్రల్ బస్ స్టేషన్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. శ్రీనివాస బస్‌స్టేషన్‌లో పెచ్చులూడి వుండడాన్ని పరిశీలించారు. పార్సిల్ ఆఫీసును పరిశీలించారు. శ్రీహరి బస్టాండ్‌లో దుకాణ దారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంఆర్ పి కే వస్తువు అమ్మాలని సూచించారు. టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఎలక్ట్రిక్ బస్సు లో ఎమ్మెల్యే ఇతర అధికారులు బస్టాండ్ లోని ఏడుకొండలు బస్‌స్టేషన్, పల్లెవెలుగు బస్‌స్టేషన్లను పరిశీలించారు. అయిల్ డిపోను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్‌ఎం ఆఫీసులో ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రస్తుత బస్టేషన్ స్థానంలో ఆధునిక హంగులతో కొత్తగా ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ డిజైన్, డిపిఆర్ ను ఆర్‌ఎం చెంగల్ రెడ్డి, డిప్యూటీ సిటీఎం భాస్కర్ లు ఎమ్మెల్యేకి వివరించారు. 13.18 ఎకరాల్లో ఐదు వందల కోట్లతో 13ఫ్లోర్స్ తో ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ ను నిర్మించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వ వాటాతో పాటు థర్డ్ పార్టీ తో ఈ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. డిజైన్ తుది ఆమోదం దశలో ఉందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి టెర్మినల్ విషయం తీసుకెళ్లి త్వరలో వెండర్ పిలిచి మూడేళ్లలో కొత్త బస్టేషన్ అన్ని హంగులతో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఇప్పటికే అధునాతన సౌకర్యాలతో తిరుపతి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. రేణిగుంట విమానాశ్రయం అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని ఎయిర్ పోర్టు అభివృద్ధికి కూడా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్, ఊకా విజయ్ కుమార్, చిన్న బాబు, దంపూరి భాస్కర్ యాదవ్, జనసేన నేతలు హేమంత్ యాదవ్, గాలి వేసి, జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, నెలవాయి మురళి, మోహన్ రాయల్, సుధా పాల్గొన్నారు.

జనసైనికులు కష్టపడి పనిచేయాలి: వినుత కోటా

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: సమసమాజ స్థాపన లక్ష్యంగా ఆవిర్భవించిన జన సేన క్రియాశీలక సభ్యత్వం తీసుకుని నిజ మైన జన సైనికులు లాగా కష్టపడి పని చేయా లని ఆ పార్టీ శ్రీకాళహస్తి వినుత కోటా పేర్కొన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE,SRIKALAHASTI
I.A.NO.375/2022
O.S No.144/ 2022

Between
K.Bala Subramanyam ...Plaintiff
And
N.Aruna & 2 Others ...Defendants
To
D1. N.Aruna W/o. N.Subramanyam, Siddagunta Village, Balayapalli Mandal, SPSR Nellore Dist.,
D2. K.Bujjamma, W/o. Gurravaiah, Penkulapadu Village, Srikalahasti Mandal, Tirupati Dist.,

దావా నోటీసు

పై నెంబరు దావాలో Permanent Injunction కొరకు 15 ప్రతివాది మరియు 2వ ప్రతివాదులకు దావా సమన్లు మరియు నోటీసులు చేరనందున పత్రికాప్రకటన ద్వారా వాయిదా 30.07.2024 యున్నది. కావున పై ప్రతివాదులు ఉదయం 10:30 నిలకు పై కోర్టు వ్యక్తిగతంగా గాని, లేదా లాయర్ ద్వారా గాని తగిలి హాజరు కాగలరు. లేనిచో పై తేదీన మీరు లేనట్టుగా పరిగణించి కోర్టు వారు తగు నిర్ణయం తీసుకోనబడును.

ఎ. సుధాకర్, B.A., B.L.
వాది తరపు న్యాయవాది

IN THE COURT OF THE III ADDL DISTRICT JUDGE: TIRUPATI
OS.No. 19/2011

Between
Nagaveti Subramanyam Achari ...Plaintiff
And
A. Chenchu Lakshmi @ Chenchu Munemma and others ...Defendants

SUIT SUMMONS TO DEFENDANT NO.7 to 9

To
D7. Y. Radhakrishna H/o late A. Eswaramma,
D8. Y. Janaki Prasad S/o Y. Radhakrishna,
D9 Y. Hari S/o Y. Radhakrishna,
All are residing at Cherlopalli Village, near Alipiri Bypass Road, Chandragiri Mandal, Chittoor District now in Tirupati District

The suit is posted to 26-07-2024 for appearance of you before the Hon'ble Court. You shall appear on 26-07-2024 at 10.30 AM in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit, in default your appearance on the day before mentioned the suit will be heard and set exparte in your absence.

M.PENCHALAIAH
Advocate: Tirupati

క్రైం న్యూస్

దాడి కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ సూర్య నారాయణ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి దాస్ , తన విధుల నిమిత్తం గూడూరు సాధుపేట లోని టీ దుకాణానికి తన సహచర కానిస్టేబుల్‌తో కలిసి టీ తాగేందుకు వెళ్లడన్నారు. వెనక భాగం నుండి పత్తిపు బెంగాల్ కె వెంకట లల్లు కలిసి అనే యువకుడు కర్రతో దాడి చేశాడని, స్థానికులు వెంటనే స్పందించి పట్టుకున్నారన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ సీఐ పాపా రావు, ఎస్ఐ శ్రీహరి బాబు , సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో చోరీ

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం మండలం మిట్టపాలెం సచివాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గురువారం విధులు ముగించుకుని సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు సచివాలయానికి తాళం వేసి వెళ్లిన కార్యదర్శి నాగమణి శుక్రవారం ఉదయం యధావిధిగా విధులకు హాజరై కార్యాలయాన్ని తెరిచి చూడగా సచివాలయంలో వుంచిన సుమారు 40 వేలు రూపాయలు విలువ చేసే రెండు ప్రింటర్లు కనిపించలేదని, ఎవరో గుర్తు తెలియని దొంగలు కిటికీ అద్దాలను పగలగొట్టి సచివాలయం లోపలికి ప్రవేశించి దొంగలించినట్లు వెల్లడించినట్లు కార్యదర్శి గుర్తించారు. కార్యదర్శి నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి ప్రకారం జిల్లా కొమరోలు మండలంలో 28ఎర్రచందనం దుంగలతో పాటు, ఒక కారును స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనలతో కడప సబ్ కంట్రోల్ ఆర్‌ఐ చిరంజీవులు, ఆర్‌ఎస్ఐ నరేష్ బృందం, అటవీ సిబ్బంది సహకారంతో గురువారం ప్రకాశం జిల్లా కొమరోలు మండలం వైప ఎంబీ ఏఫ్గిటి పాయింట్లు తనిఖీ చేస్తూ అర్ధరాత్రి ప్రకారం బెలిఫోరట్‌ పారెస్టు డివిజన్ వెల్లవా పేట రేంజి తాటిచెర్ల సెక్షన్, నల్లకుంట్ల అటవీ బీటు పరిధిలోని అక్కాపల్లి చెరువు చేరుకున్నారని ఆ ప్రాంతంలో ఒక కారు నిలిచి ఉందన్నారు. అందులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తున్నారని, టాస్క్ ఫోర్సు సిబ్బంది చుట్టుముట్టగా స్మగ్లర్లు వాహనం వదిలి పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించి ముగ్గురిని పట్టుకున్నామన్నారు. మొదట కింద ఉన్న 11 దుంగలు, కారులో 17 దుంగలు లభించాయన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్ కు చెందిన పేరం రామారాజు (44), సంచర్ల పంచాయతీ రామేశ్వరం గ్రామానికి చెందిన రాజకొండ రామయ్య (25), క్రిష్ణంశెట్టి పల్లి మండలం షేక్ భాసిం (43)లుగా గుర్తించామన్నారు. పేరం రామారాజు అనే వ్యక్తికి తమిళనాడుకు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తెలిసిందన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

వైసిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: వైసిపి కార్యకర్తపై టిడిపి కార్యకర్తలు విచక్షణ రహితంగా దాడి చేసి గాయ పరిచిన ఘటన శుక్రవారం తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం గుండిగొలను పంచాయతీ కొత్త కండ్రిగ గ్రామంలో చోటుచేసుకుంది. తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌ఐ రావులేంద్ర కథనం మేరకు..కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన ఎర్రయ్య, ఆదే గ్రామానికి చెందిన సురేష్, వెంకటసుబ్బయ్య లకు పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎర్రయ్య స్కూలుకు వెళ్లిన తన కుమారుడిని ద్విచక్ర వాహనంలో తీసుకొని ఇంటికి వస్తుండగా కొత్త కండ్రిగ సమీపంలో వెంకటసుబ్బయ్య, సురేష్‌లు దారికాచి అడ్డుకున్నారు. తమతో తెచ్చుకున్న కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. దాడిలో గాయపడ్డ ఎర్రయ్యను బంధువులు శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ కి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో ఉద్యానవనం అభివృద్ధి

రేణిగుంట : వైసిపి కార్యకర్తపై టిడిపి కార్యకర్తలు విచక్షణ రహితంగా మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కోటి రూపాయల నిధులతో నిర్మించిన ఉద్యానవనం అరణ్యాన్ని తలపిస్తుండడంతో బిస్మిల్లానగర్ ప్రజలు ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్లారు. రేణిగుంట పట్టణ అధ్యక్షులు మహబూబ్‌బాషా మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఈ ఉద్యానవనాన్ని ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎంఎల్ఏ స్పందిస్తూ తప్పకుండా ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.

దళిత ఆదివాసీ అన్యాయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి : ఆర్‌పిఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులకు సంబంధించి గత ఐదు సంవత్సరాల కాలంలో వీరిపై జరిగిన హత్యలు, అత్యాచార సంఘటనలు, సంక్షేమ పథకాలు,ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగం పైన శ్వేతపత్రం విడుదల చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు అంజయ్య డిమాండ్ చేశారు. ఈనెల 22న జరగనున్న శాసనసభ సమావేశాల్లో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ వైసిపి హయాంలో జరిగిన ఘటనలపై సమగ్ర పరిశీలన చేసి శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. 27 సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేయడం వల్ల కోట్ల మంది లబ్దిదారులు నష్టపోయారన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఓజిలి : ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. ప్రభుత్వ అధికారులతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ , మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఎంపిడివో కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓజిలి మండలంలోని వివిధ శాఖల అధికారులందరూ కలిసి ఒకటిగా సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షుడు విజయ కుమార్ నాయుడు , ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసరెడ్డి, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షులు పాది వెంకటసుబ్బయ్య , టిడిపి నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, గున్నం రెడ్డి మధుసూదన రెడ్డి , కనుమూరు గోపాల్ రెడ్డి , ఎద్దుల ధనుంజయ రెడ్డి , దాసరినిరంజన్ ఆధ్వర్యంలో టిడిపి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బచ్చల రవీందర్ రెడ్డి , ఈశ్వర్ రాజు , ఖలీల్ పాల్గొన్నారు.

In The Court of The VII Addl. District Judge : Gudur
E.P. No. 19 / 2023
O.S.No. 46 / 2018

Gattamaneni Arun Kumar - Petitioner/D.Hr
Vs
Duvvuru Bharathi - Respondent/J.Dr.

వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు డి.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని 3 09-08-2024వ తేదీన ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాటపాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore District - Gudur Registration - Gudur Sub Registration-Gudur Mandal-Gudur Municipal Area-West Gudur-Survey No.1750- Malavya Nagar-Ward No.1-Door No.440-Assessment No.1029009538- Vacant site of 40 ankanams consisting of Terraced building Ground Floor 1225 sq.ft and First Floor 1225 sq.ft bounded by: **East:** Apartment of Vasudeva Raju, **South:** House of Kambampati Venkateswarlu, **West:** Raja Street (Municipal Road), **North:** Raja Street (Municipal Road). Within these boundaries an extent of 40 ankanams consisting of Terraced building Ground Floor 1225 sq.ft and First 1225 sq.ft.

DHR Value of Rs.40,00,000/-
Amin Value of Rs.60,00,000/-
Market Value of Rs.53,31,000/-

వి.శ్రీనివాసన్, బి.ఎస్సి., బి.ఎల్.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.